



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 9 సంచిక : 217 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 12 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :217 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 12 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# టీడీపీ క్యాడర్ తో చంద్రబాబు కాఫీ కబుర్లు...





- కార్యకర్తలతో 'కాఫీ కబుర్లు' పేరుతో సీఎం చంద్రబాబు సమావేశం
- క్లీన్ పాలిటిక్స్‌కు టీడీపీని కేరాఫ్ అడ్రస్‌గా మార్చాలని దిశానిర్దేశం
- క్వాంటం టెక్నాలజీతో ఏపీని అభివృద్ధి చేస్తామని వెల్లడి
- గత ప్రభుత్వం పెంచిన కరెంట్ ఛార్జీలను తగ్గిస్తున్నామన్న ముఖ్యమంత్రి

**పెన్ పవర్ డెస్క్:**మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'కాఫీ కబుర్లు' పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు రాజకీయ, పరిపాలనా అంశాలపై దిశానిర్దేశం చేశారు. రాజకీయాల్లో నిజాయతీగా ఉంటేనే విలువ ఉంటుందని, ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాలు చేయాలి కానీ జీవనోపాధిగా ఎంచుకోకూడదని ఆయన హితవు పలికారు. క్లీన్ పాలిటిక్స్‌కు టీడీపీని కేరాఫ్ అడ్రస్‌గా మార్చాలని దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నాడు ఐటీతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినట్టే, నేడు క్వాంటం టెక్నాలజీతో ఏపీని, అమరావతిని అభివృద్ధి చేస్తున్నాం. ఈ నెల 14న క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభిస్తాం" అని వెల్లడించారు. గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను 9 సార్లు పెంచిందని, తమ ప్రభుత్వం ఛార్జీలను తగ్గిస్తోందని స్పష్టం చేశారు. సోలార్ విద్యుత్ వినియోగంపై ఫీడ్‌బ్యాక్ తీసుకోగా, తమ విద్యుత్ బిల్లుల భారం తగ్గిందని పలువురు కార్యకర్తలు ముఖ్యమంత్రికి తెలిపారు.
సమగ్ర నీటి నిర్వహణ ద్వారా ప్రాజెక్టులను నింపామని, మే 15 నాటికే పంటలకు నీరు అందిస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ప్రతి కులానికి దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం, ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు.



## అమరావతి 'ఘోస్ట్ క్యాపిటల్'గా మారే ప్రమాదం ఉంది

- రాష్ట్ర ప్రయోజనాలను కూటమి ప్రభుత్వం తాకట్టు పెడుతోందన్న అమర్నాథ్
- ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన
- వైసీపీ హయాంలోనే విశాఖ రైల్వే జోన్ సాధ్యమైందని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రాజధాని నిర్మాణం, ఉత్తరాంధ్ర అభివృద్ధి అంశాలపై మాజీ మంత్రి, వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబుకు అధికారం ఇచ్చి నాలుగోసారి మోసపోయారని, కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణను విస్మరించి, కేవలం అమరావతిపైనే లక్షల కోట్లు కుమ్మరించడం వల్ల ఉత్తరాంధ్ర తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని

మిగతా 2లో



## మంత్రి టీజీ భరత్ జిమ్ వీడియోపై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- జిమ్ లో మంత్రి టీజీ భరత్ కఠినమైన వర్కౌట్లు
- ఆయన కసరత్తులను రాష్ట్ర పెట్టుబడులతో ముడిపెట్టిన లోకేశ్
- అడ్డంకులు దాటుతూ పెట్టుబడులకు అనువైన వాతావరణం సృష్టిస్తున్నారని వ్యాఖ్య
- వీడియోను పంచుకున్న వైనం

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌పై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆసక్తికరమైన రీతిలో ప్రశంసలు కురిపించారు. జిమ్‌లో టీజీ భరత్ కఠినమైన వ్యాయామాలు చేస్తున్న వీడియోను షేర్ చేసిన లోకేశ్, ఆయన కసరత్తులను రాష్ట్రంలో పెట్టుబడుల వాతావరణంతో ముడిపెడుతూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తి కలిగిస్తున్నాయి. టీజీ భరత్ జిమ్‌లో జంపింగ్స్ తో కూడిన వర్కౌట్ చేస్తున్న వీడియోను

మిగతా 2లో

## ఏపీలో 61 రోజుల చేపల వేట నిషేధం.. ఏప్రిల్ 15 నుంచి అమలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక
- వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ. 20 వేల ఆర్థిక సాయం
- ప్రభుత్వం అందిస్తున్న ప్రమాద బీమా రూ. 10 లక్షలకు పెంపు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో సముద్రంలో చేపల వేటపై నిషేధం అమల్లోకి రానుంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మొత్తం 61 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నిషేధం కొనసాగుతుంది. ఈ మేరకు రాష్ట్ర మత్స్యశాఖ అధికారికంగా

మిగతా 2లో



## కీసర టోల్‌ప్లాజా వద్ద ఘోర ప్రమాదం
### కారుపై బోల్తా పడిన ట్యాంకర్.. న్యాయవాది మృతి

- ఎన్టీఆర్ జిల్లా కీసర టోల్‌ప్లాజా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- బ్రేకులు ఫెయిల్ కావడంతో కారుపై బోల్తా పడిన సిమెంట్ ట్యాంకర్
- ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు.. ఒకరు అక్కడికక్కడే మృతి
- క్రేన్ల సహాయంతో ట్యాంకర్‌ను తొలగించి మృతదేహాన్ని వెలికితీత
- ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు

**పెన్ పవర్ డెస్క్:**ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద శని వారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బ్రేకులు విఫలం కావడంతో ఓ సిమెంట్ ట్యాంకర్ అదుపుతప్పి బీఎండబ్ల్యూ కారుపై బోల్తా పడింది.

మిగతా 2లో



## అప్పులు కట్టలేక అమెరికా వీడిన జో బైడెన్ కుమారుడు

- అప్పుల ఊబిలో బైడెన్ కుమారుడు హంటర్
- దేశం విడిచి విదేశాల్లో నివసిస్తున్నట్లు వెల్లడి
- న్యాయవాదుల ఫీజులు కూడా చెల్లించలేని దీనస్థితి
- దాదాపు రూ.158 కోట్ల మేర అప్పులు ఉన్నట్లు సమాచారం
- దక్షిణాఫ్రికాలో ఉండొచ్చని అధికారుల అనుమానం

మిగతా 2లో

## 'వి వి గన్'గా మార్చుకోండి
### జగన్ పార్టీపై హోంమంత్రి అనిత సెటైర్స్



**పెన్ పవర్ డెస్క్:**రాజకీయ స్వార్థం కోసం కన్నతల్లిని, చెల్లెలిని కూడా వైఎస్ జగన్మోహన్ రెడ్డి

మిగతా 2లో

# బెంగాల్ ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదు



- బెంగాల్ సభల్లోని ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదన్న ప్రధాని
- మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు ఖాయమని జోస్యం
- టీఎంసీ 15 ఏళ్ల పాలనలోని అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్న మోదీ
- తొలి కేబినెట్ భేటీలోనే ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమ బెంగాల్‌లో తన ప్రచార సభలకు వస్తున్న జనాన్ని, వారి ఉత్సాహాన్ని తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా ఎన్నడూ చూడలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మధ్యాహ్నం తూర్పు బర్ధమాన్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంత భారీ సభను గుజరాత్‌లో కూడా ఏర్పాటు చేయలేకపోయేవారమని, మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనమని అన్నారు.

**బీజేపీ వస్తే టీఎంసీ 15 ఏళ్ల అవినీతిపై శ్వేతపత్రం: మోదీ హామీ**

ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే, గత 15 ఏళ్ల టీఎంసీ పాలనలో జరిగిన అవినీతిపై శ్వేతపత్రం

మిగతా 2లో



## ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్-అమెరికా చర్చలు...
### జేడీ వాన్స్ కు స్వాగతం పలికిన షరీఫ్


- శాంతి స్థాపన కోసం అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు
- పాక్ ప్రధాని షెహబాజ్‌తో అమెరికా వైస్ ప్రెసిడెంట్ భేటీ
- శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్
- ప్రాంతీయ శాంతి స్థాపనే లక్ష్యంగా ఈ చర్చలు
- భేటీలో పాల్గొన్న జేడీ వాన్స్, జారెడ్ కుష్నర్

మిగతా 2లో

## 'బ్రహ్మోస్'పై ఆసక్తి చూపిస్తున్న ఆగ్నేయాసియా దేశాలు...


- దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్‌కు చెక్
- బ్రహ్మోస్ కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు
- అమెరికా భద్రతా హామీలపై సందేహాలు పెరగడంతో భారత్ వైపు చూస్తున్న దేశాలు
- భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణి కొనుగోలుకు ఇండోనేషియా నిర్ణయం
- ఇప్పటికే ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ అందించిన భారత్, వియత్నాంతోనూ చర్చలు

మిగతా 2లో



## 2028 నుంచి ఆ బైక్‌ల రిజిస్ట్రేషన్ బంద్..

- ఢిల్లీలో పెట్రోల్ టూ-వీలర్లకు చెక్.. 2028 నుంచి రిజిస్ట్రేషన్ల బంద్!
- 2027 జనవరి నుంచే పెట్రోల్, సీఎన్‌జీ ఆటోల రిజిస్ట్రేషన్లు బంద్
- కొత్త ఈవీ టూవీలర్ కొంటే రూ.30,000 వరకు సబ్సిడీ
- పాత పెట్రోల్ వాహనాన్ని స్క్రాప్ చేస్తే రూ.10,000 అదనపు ప్రోత్సాహకం
- వాయు కాలుష్యం నియంత్రణే లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు



మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# మహనీయుల స్ఫూర్తితో కుల వివక్షను తరిమికొడదాం

'కుల వివక్ష ఇప్పుడు ఎక్కడుంది? ఇప్పుడంతా మారిపోయింది అందరూ కలిసి తింటున్నారు. కలిసి తిరుగుతున్నారు. హోటళ్లలో, జాతర్లలో, ఉత్సవాల్లో అన్నింట్లో కలిసే ఉంటున్నారు. ఇంకెక్కడుంది?' ఈమధ్య మనువాదుల నుండి ఈ మాటలు వినిపిస్తున్నాయి. మోడీ పాలనలో దేశం చాలా మారిందంటున్నారు. వివక్ష లేనే లేదంటున్నారు. కానీ?నేటికీ నిచ్చెన మెట్ల కుల జాఢ్యం అణగారిన ప్రజల్ని పట్టి పీడిస్తూనే ఉంది.మాలమాదిగ పల్లెల్లో ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా కనిపిస్తూనే ఉంది. అయితే గతంలో ఉన్నంత మొరటుగా ఇప్పుడు లేకపోవచ్చు కానీ, కులవివక్ష రూపం మార్చుకుని మరో రూపంలో కొనసాగుతున్నది. శాస్త్ర, సాంకేతిక రంగం ఇంత అభివృద్ధి చెంది మంచి ఫలితాలు సాధిస్తుంటే ఇదేం కులవివక్ష అనుకోవచ్చు. స్వాతంత్ర్యం రాక ముందు, వచ్చిన తర్వాత కొనసాగడానికి అగ్రవర్ణాల ఆధిపత్యంతో నడిచే పాలక ప్రభుత్వాలే కారణమని చెప్పవచ్చు.మన రాష్ట్రంలోనూ దళితులపై దుర్మార్గమైన దాడులు, దౌర్జన్యాలు, లైంగిక అకృత్యాలు, హత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని జాతీయ నేర విభాగం నివేదికలు తెలుపుతున్నాయి. నగరాల్లో శాకాహారులకు మాత్రమే ఇళ్లు అద్దెకిస్తారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు అద్దెకు ఇవ్వరు. పైగా 'శాకాహారులకు మాత్రమే ఇల్లు అద్దెకు ఇవ్వబడును' అని తమ ఇంటి గోడలు, గేట్‌లకు బోర్డులు పెడుతున్నారు.

జస్టిస్ పున్నయ్య కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి 164 రకాల కులవివక్ష రూపాలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. పరిష్కారం కోసం సూచనలు చేసింది. కమిషన్ ఏర్పాటు చేసిన పాలకులు ఆ సూచనలను చిత్తశుద్ధితో అమలు చేయాలి కదా! నేటికీ పున్నయ్య సిఫారసు చేసిన నలభై అంశాల్ని సర్కార్ పట్టించుకోవడమే లేదు. ఫలితంగా నేటికీ కుల వివక్ష రూపాలు కొనసాగుతున్నాయి. పున్నయ్య కమిషన్ చేసిన సిఫారసుల్లో ప్రధానమైనది?వారంలో ఒకరోజు ప్రభుత్వ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కుల వివక్షను గుర్తించి దాన్ని రూపుమాపడానికి ప్రయత్నించడం. కానీ ఎక్కడా ఆ సిఫారసు అమలుకు నోచుకోవటం లేదు. 1955 పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రతి నెల చివరి రోజు కుల వివక్ష, అంటరానితనంపై చైతన్య సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నది. కానీ దాన్ని ఎక్కడా అమలు జరపటం లేదు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగిన సందర్భంలో ఏకైక రక్షణ కవచంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పూర్తిగా నీరుగారుస్తున్నారు. 41 సి.ఆర్.పి.సి కింద స్టేషన్ బెయిలిస్తూ దాడులు మరింతగా పెంచడానికి ఊతమిచ్చే విధంగా వ్యవహరిస్తున్నారు. ఆరెస్సెస్-బిజెపి మనువాద మతోన్మాద విధానాలు పల్లెల వాతావరణాన్ని చెదరగొడుతున్నాయి. కుల వివక్ష, అంటరానితనాన్ని మరింతగా విస్తృత పరుస్తున్నాయి. చినజీయర్ స్వామి లాంటి వారు 'కులం ఉండాల్సిందే, కులం పోకూడదు. ఒక మనిషి శరీరానికి కాళ్లు రెక్కలు ఎంత అవసరమో, దేశానికి కులాలు అంత అవసరం' అని ప్రబోధిస్తున్నారు. గ్రామ సీమల్లో దళితులు అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తే?దానికి పోటీగా ఆరెస్సెస్ వారు?ఇతరులను రెచ్చగొట్టి, ఇతర నాయకుల విగ్రహాలను పెట్టి ప్రజల మధ్య ఘర్షణలను సృష్టించి కులాల కుంపటిని రగిలించి రాజకీయాలు నడుపుతున్నారు. పూలే, అంబేద్కర్ జయంతి, వర్ధంతుల సందర్భంగా దండలేసి దండాలు పెట్టి వారి ఆశయాలు నెరవేర్చినట్టు భావిస్తుంటారు కొందరు. కానీ పూలే, అంబేద్కర్ తమ వ్యక్తిగత జీవితంలో అనుభవించిన కుల వివక్షను పారదోలటానికి ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలు నిర్మించారు. వాటి గురించి మాత్రం ఆలోచించరు. పూలే-అంబేద్కర్ అడుగు జాడల్లో నడుస్తున్న కె.వి.పి.ఎస్?నేటికీ కొనసాగుతున్న కుల వివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలను చేయసాగింది. అందులో భాగంగానే ఈ నెల 11 (పూలే జయంతి) నుండి 14 (అంబేద్కర్ జయంతి) వరకు ఈ ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. క్షేత్ర స్థాయిలో కుల వివక్షపై సమగ్ర సర్వేలు చేసి ప్రత్యక్ష ప్రతిఘటనా పోరాటాలు నిర్వహించాలని సంఘం నిర్ణయించింది. సమాజహితం కోరుకునే వ్యక్తులు, శక్తులు, ప్రజాసంఘాలు, సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తూ ఈ ఉద్యమాల్లో పాలుపంచుకోవాలని కె.వి.పి.ఎస్ పిలుపునిస్తోంది. చాప కింద నీరులా పాకుతున్న మనువాద సంస్కృతి, కుల వివక్ష, అంటరానితనం పూర్తిగా రూపుమాపబడాలంటే ప్రజలు ఐక్యంగా పూనుకోవాలి. వీటిని ప్రతిఘటించి పారదోలాలి.

# అమరావతి 'ఘోస్ట్ క్యాపిటల్'గా మారే ప్రమాదం ఉంది

- మొదటి పేజి తరువాయి

అమర్నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న అమరావతి నగరం ఎప్పటికి పూర్తవుతుందో ఎవరికీ తెలియదని, అది భవిష్యత్తులో జన సంచారం లేని "ఘోస్ట్ క్యాపిటల్" (నిర్జన నగరం)గా మారే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా మలేషియాలోని 'పుత్రజయ' నగరాన్ని ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. కేవలం భవనాలు కడితే సరిపోదని, ప్రజా జీవనం లేకపోతే ఆ నగరం నిరర్థకమవుతుందని అభిప్రాయపడ్డారు.ఐదు దశాబ్దాల పోరాటం తర్వాత వైసీపీ హయాంలోనే విశాఖ రైల్వే జోన్ సాధ్యమైందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం దానిపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. రైల్వే జోన్ కోసం తాను చేపట్టిన దీక్షపై కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తూ, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కీలకమైన కేకే (ఖఖ) రైల్వే లైన్ ఒడిశాకు వెళ్లిపోతుండటం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని, ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారని అమర్నాథ్ విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కూడా ప్రభుత్వం రాజీపడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తోందని ధ్వజమెత్తారు. వైసీపీ ఎప్పుడూ అభివృద్ధి వికేంద్రీకరణకే కట్టుబడి ఉంటుందని, అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. కేవలం ఒకే ప్రాంతంపై దృష్టి పెట్టి మిగిలిన రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టవద్దని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# 2028 నుంచి ఆ బైక్‌ల రిజిస్ట్రేషన్ బంద్..

: దేశ రాజధానిలో కాలుష్యానికి చెక్‌పెట్టేలా.. ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు మొగ్గు చూపేలా ఢిల్లీ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ఎలక్ట్రిక్ వెహికిల్ ముసాయిదా పాలసీ (2026-30)ని ఢిల్లీ ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది . ఇందులో కీలక ప్రతిపాదనలు ఇవే..

2027, జనవరి ఒకటి నుంచి ఎలక్ట్రిక్ త్రీ వీలర్‌ల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే అనుమతి ఉంటుంది. ఆ తర్వాత టూవీలర్స్‌ను ఆ జాబితాలోకి తీసుకువస్తారు. ఏప్రిల్ 1, 2028 నుంచి ఎలక్ట్రిక్ మోడల్స్ రిజిస్ట్రేషన్‌ను మాత్రమే అనుమతించనున్నారు. ఢిల్లీ నగరంలో పెట్రోల్, డీజిల్ వాహనాలను క్రమంగా తగ్గించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం.ప్రజలను ఈవీ కొనుగోళ్ల వైపు మళ్లించేందుకు ప్రోత్సాహకాలను ఢిల్లీ రవాణా శాఖ ప్రతిపాదించింది. ఈవీల్లోకి మారితే విద్యుత్ వినియోగం పెరుగుతుంది గనక రూ.2.25 లక్షల విలువైన టూవీలర్‌ను కొంటే.. ఒక కిలోవాట్‌అవర్‌కు రూ.10వేల నుంచి రూ.30 వేల వరకు ప్రోత్సాహకం అందనుంది. త్రీవీలర్ ఈవీలకు తొలి ఏడాది రూ.50వేలు లభిస్తాయి. క్రమంగా ఆ మొత్తం తగ్గుతూ వస్తుంది. పాతవాహనాలు తుక్కుగా మార్చి, ఈవీల్లోకి మారినా ఈ ప్రోత్సాహకాలు అందనున్నాయి. ఈవీల కోసం ప్రభుత్వం ఛార్జింగ్ సౌకర్యాలను భారీగా పెంచనుంది.

ఈ కొత్త ప్రతిపాదనలను అభిప్రాయ సేకరణ కోసం 30 రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉంచారు. వాటిని పరిగణనలోకి తీసుకొని తర్వాత తుదిరూపు ఇవ్వనున్నారు. కాగా.. ప్రతి శీతాకాలం ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుపోతోంది. దాంతో అక్కడి ప్రజలు శ్వాస సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలకు చెక్ పెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

# 'బ్రహ్మోస్'పై ఆసక్తి చూపిస్తున్న ఆగ్నేయాసియా దేశాలు...

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో భారత్ ప్రాధాన్యత అంతకంతకూ పెరుగుతోంది. ముఖ్యంగా, దక్షిణ చైనా సముద్రంలో చైనా దూకుడును ఎదుర్కొనేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్ వైపు ఆశగా చూస్తున్నాయి. ఇందులో భాగంగా, భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని సమకూర్చుకోవడంపై అమిత ఆసక్తి కనబరుస్తున్నాయి. ఫిలిప్పీన్స్ తర్వాత తాజాగా ఇండోనేషియా కూడా బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు నిర్ణయం తీసుకోవడమే దీనికి నిదర్శనం. భారత్... ఆగ్నేయాసియాను బ్రహ్మోస్ క్షిపణికి కీలక మార్కెట్‌గా పరిగణిస్తోంది. శబ్దం కంటే వేగంగా (మాక్ 2.8 నుంచి 3 మధ్య వేగంతో) ప్రయాణించే ఈ క్షిపణి, తన కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగలదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇది నిరూపితమైంది. సుమారు 400 కిలోమీటర్ల పరిధి కలిగిన బ్రహ్మోస్‌ను భూమి, సముద్రం, గాలి, జలాంతర్గాముల వివిధ ఉపరితలాల నుంచి ప్రయోగించవచ్చు. ఈ ప్రత్యేకతల కారణంగా, చైనా నౌకాదళ దూకుడును నిలువరించేందుకు ఇది సరైన ఆయుధమని ఆగ్నేయాసియా దేశాలు భావిస్తున్నాయి. ఈ మేరకు 'ఇండియా నరేటివ్' తన కథనంలో వివరాలను వెల్లడించింది.ఇండియా నరేటివ్ నివేదిక ప్రకారం, దక్షిణ చైనా సముద్ర తీర దేశాలైన వియత్నాం, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా వంటివి తమ నిరోధక సామర్థ్యాలను పెంచుకోవడంపై దృష్టి సారించాయి. చైనా ఇప్పటికే శక్తివంతమైన ాూ2/ూణ వ్యవస్థలను అభివృద్ధి చేయగా, బ్రహ్మోస్ వంటి క్షిపణులతో చిన్న దేశాలు కూడా అదే తరహా వ్యూహాన్ని అనుసరించి తమ సముద్ర జలాలను కాపాడుకోగలవని నివేదిక పేర్కొంది.ఇదే సమయంలో, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా తన క్షిపణి, నౌకాదళ వనరులను ఇండో-పసిఫిక్ నుంచి తరలిస్తోంది. దీంతో చైనా దూకుడును ఎదుర్కోవడంలో అమెరికా ఇచ్చే భద్రతా హామీలపై ఆగ్నేయాసియా దేశాల్లో అపనమ్మకం పెరుగుతోంది. అమెరికా 2025 జాతీయ భద్రతా వ్యూహంలో కూడా ఈ ప్రాంతానికి ప్రాధాన్యత తగ్గించడం వారి ఆందోళనలను మరింత పెంచింది.ఈ నేపథ్యంలో, తమ సైనిక సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతో భాగస్వామ్యాలను విస్తరించుకుంటున్నాయి.

భారత్ ఇప్పటికే 2024లో ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను అందించింది. ఇప్పుడు ఇండోనేషియాతో ఒప్పందం కుదుర్చుకుంది. వియత్నాంతో దాదాపు 700 మిలియన్ డాలర్ల ఒప్పందానికి కూడా చేరువలో ఉంది. ఈ పరిణామాలు కేవలం ఆయుధ విక్రయాలుగానే కాకుండా, విస్తృత ఇండో-పసిఫిక్ భూ-వ్యూహాత్మక క్షేత్రంలో భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# బెంగాల్ ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదు

- మొదటి పేజి తరువాయి

విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని టీఎంసీ భయాందోళనలు సృష్టిస్తోందని, ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయబోమని స్పష్టం చేశారు. కేవలం తృణమూల్ నేతల అవినీతి, దోపిడీ దుకాణాలను మాత్రమే మూసివేస్తామని అన్నారు.తాము అధికారంలోకి వస్తే, కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలోని తొలి కేబినెట్ సమావేశంలోనే రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం చేస్తామని మోదీ ప్రకటించారు. ఇన్నాళ్లూ ఈ పథకాన్ని అమలు చేయకుండా తృణమూల్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని, బీజేపీ ప్రభుత్వంతో ఆ రోజులు ముగిసిపోతాయని తెలిపారు.

చొరబాటుదారులు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు అంతేగాక కొత్త ప్రభుత్వం చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఇక్కడ

స్థిరపడటానికి సహాయం చేసిన వారిని కూడా వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

# కీసర టోల్‌ప్లాజా వద్ద ఘోర ప్రమాదం

## కారుపై బోల్తా పడిన ట్యాంకర్.. న్యాయవాది మృతి

- మొదటి పేజి తరువాయి

ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఓ న్యాయవాది అక్కడికక్కడే మృతి చెందారు.వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ వైపు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ కీసర టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే బ్రేకులు పని చేయలేదు. దీంతో అదుపుతప్పిన ట్యాంకర్, ముందు వెళుతున్న కారు (టా 09 ఖీ 6662) మీదకు దూసుకెళ్లి బోల్తా పడింది. భారీ ట్యాంకర్ కింద కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.ట్యాంకర్‌ను తొలగించేందుకు క్రేన్లు, జేసీబీలను రంగంలోకి దించారు. సుమారు గంటపాటు శ్రమించి ట్యాంకర్‌ను పక్కకు తీసి, కారులో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని వెలికితీశారు. వాహన రిజిస్ట్రేషన్ ఆధారంగా కారు యజమాని హైదరాబాద్‌లోని ఎల్లారెడ్డిగూడకు చెందిన హైకోర్టు న్యాయవాది బొద్దులూరి శ్రీనివాసరావుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బ్రేకులు ఫెయిల్ అవ్వడమే ప్రమాదానికి ప్రాథమిక కారణమని భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అప్పులు కట్టలేక అమెరికా వీడిన జో బైడెన్ కుమారుడు

అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ దేశాన్ని వీడినట్లు తెలుస్తోంది. హంటర్ బైడెన్ విదేశాల్లో నివసిస్తున్నట్లు ఆయన న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఎక్కడున్నారన్న విషయంపై తనకు కూడా స్పష్టత లేదన్నారు. తనకు చెల్లించాల్సిన 50,000 డాలర్ల బకాయిలను కూడా చెల్లించలేదని తెలిపారు. అమెరికాలో 17మిలియన్ డాలర్ల (దాదాపు రూ.158కోట్లు) అప్పు ఉన్న సమయంలో హంటర్ యూఎస్‌ను వీడడం గమనార్హం. తాను అప్పుల్లో కూరుకుపోయినట్లు హంటర్ బైడెన్ గతేడాది ఓ ఇంటర్వ్యూలోనూ వెల్లడించారు. హంటర్ బైడెన్ ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉండే అవకాశం ఉన్నట్లు అమెరికా అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**హంటర్‌పై కేసులు..**

2018లో తుపాకీ కొనుగోలు సందర్భంగా ఆయుధ డీలరుకు ఇచ్చిన దరఖాస్తు ఫారంలో హంటర్ తప్పుడు సమాచారం ఇచ్చారు. తాను అక్రమంగా డ్రగ్స్ కొనుగోలు చేయలేదని, వాటికి బానిస కాలేదని, తనవద్ద అక్రమంగా ఆయుధం లేదని వెల్లడించారు. అయితే అది తప్పని తేలింది. అప్పటికే హంటర్ డ్రగ్స్ అక్రమంగా కొనుగోలు చేశారు. కాలిఫోర్నియాలో 1.4 మిలియన్ డాలర్ల పన్ను ఎగవేత ఆరోపణలపై కేసు నమోదైంది.

అక్రమ ఆయుధం కొనుగోలు వ్యవహారంలో హంటర్‌పై నమోదైన కేసులో 2024 జూన్‌లో న్యాయస్థానం ఆయనను దోషిగా తేల్చింది. అమెరికా అధ్యక్ష పీఠం నుంచి దిగిపోయే సమయంలో జో బైడెన్ (జీశీవ దీఱఎవఙ) అక్రమ ఆయుధం కొనుగోలు సహా రెండు క్రిమినల్ కేసుల్లో హంటర్‌కు క్షమాభిక్ష ప్రసాదించారు. తన కుమారుడిపై కేసులు రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆరోపించారు.

# మంత్రి టీజీ భరత్ జిమ్ వీడియోపై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ వీడియోకు ఆయన ఓ ఆసక్తికరమైన వ్యాఖ్యను జోడించారు. "రాష్ట్రంలో అత్యుత్తమ పెట్టుబడి వాతావరణాన్ని అందించడానికి మా పరిశ్రమల మంత్రి టీజీ భరత్ గారు ఇలా అడ్డంకులను దాటుతున్నారు" అంటూ లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో పాటు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'చూజ్ స్పీడ్ చూజ్ ఏపీ' అనే హ్యాష్‌ట్యాగ్‌లను కూడా జతచేశారు.

# ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్-అమెరికా చర్చలు...

పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి స్థాపనే లక్ష్యంగా అమెరికా, ఇరాన్ మధ్య కీలక చర్చలకు అంతా సిద్ధమైంది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ ఈ చర్చలకు వేదికగా నిలిచింది. ఈ చర్చల ప్రారంభం సందర్భంగా అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, పాకిస్థాన్ ప్రధానమంత్రి ముహమ్మద్ షెహబాజ్ షరీఫ్‌తో శనివారం సమావేశమయ్యారు.ఈ భేటీలో వాన్స్‌తో పాటు అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ పాల్గొన్నారు. ప్రధాని షరీఫ్‌కు సహాయకులుగా ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, అంతర్గత వ్యవహారాల మంత్రి మోహసిన్ రజా నఖ్వీ హాజరయ్యారు. ఇరు దేశాల ప్రతినిధులు నిర్మాణాత్మక ధోరణితో చర్చల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం పట్ల పాక్ ప్రధాని ప్రశంసించారు.ఈ చర్చలు ఈ ప్రాంతంలో సుస్థిర శాంతికి ఒక మెట్టుగా నిలుస్తాయని షెహబాజ్ షరీఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతి పునరుద్ధరణ కోసం ఇరు దేశాలకు తమ సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. అంతర్జాతీయంగా ఉత్కంఠ రేపుతున్న ఈ చర్చల ద్వారా శాంతియుత పరిష్కారం లభిస్తుందని పలు దేశాలు ఆశిస్తున్నాయి.

# 'వి వి గన్'గా మార్చుకోండి

- మొదటి పేజి తరువాయి

మోసం చేశారని హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణాన్ని సైతం రాజకీయ లబ్ధికి ఉపయోగించుకున్నారని ఆమె ఆరోపించారు. విభజన సమయంలో సోనియా గాంధీ తో లాలూచీ పడి జగన్ బెయిల్ తెచ్చుకున్నారన్నారని తెలిపారు. తన కోసం పాదయాత్ర చేసిన షర్మిలను సైతం పక్కన పెట్టడం ఆయన నైజానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తన ఐదేళ్ల పాలనలో విశాఖ లో భూకబ్జాలకు పాల్పడ్డారని , ఆ దెబ్బతో పెట్టుబడిదారులు వెనక్కి వెళ్లిపోయారని హోంమంత్రి అనిత విమర్శించారు. వైసీపీ కి "వి వి గన్" అని పేరు మార్చుకుంటే బాగుంటుందని అనిత సలహా ఇచ్చారు. ప్రజలకు సినిమా చూపిస్తానన్న జగన్‌కు, ఎన్నికల్లో ప్రజలే అసలైన సినిమా చూపించారని ఆమె ఎద్దేవా చేశారు.

# ఏపీలో 61 రోజుల చేపల వేట నిషేధం.. ఏప్రిల్ 15 నుంచి అమలు

- మొదటి పేజి తరువాయి

ఉత్తర్వులు జారీ చేసింది. సముద్ర జీవ సంపద పరిరక్షణలో భాగంగా ఏటా ఈ నిర్ణయం తీసుకుంటున్నారు.సంతానోత్పత్తి కోసమే ఈ విరామం ప్రతి ఏటా ఏప్రిల్, మే, జూన్ నెలల మధ్య కాలం చేపలు, ఇతర సముద్ర జీవుల సంతానోత్పత్తికి అత్యంత కీలకమైన సమయం. ఈ నేపథ్యంలో సముద్ర జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు, మత్స్య సంపదను పెంచేందుకు ప్రభుత్వం ఏటా ఈ వేట విరామాన్ని ప్రకటిస్తుంది. ఈ సమయంలో మత్స్యకారులు ప్రభుత్వానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నిబంధనలను ఉల్లంఘించి వేటకు వెళ్లే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 5 వేల జరిమానాతో పాటు వారి వలలను స్వాధీనం చేసుకుని, బోటు రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేస్తారు.చేపల వేట విరామ సమయంలో మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది. 'మత్స్యకారుల సేవలో' పథకం కింద అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబానికి ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం ఏప్రిల్ 17 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వివరాల సేకరణ చేపట్టనున్నారు. ఇది కాకుండా వేటకు వెళ్లే బోట్లకు డీజిల్ సబ్సిడీ, రాయితీపై ఇంజిన్లు, వలలు, తెప్ప వంటి పరికరాలను కూడా ప్రభుత్వం అందిస్తోంది. ముఖ్యంగా మోటార్ ఇంజిన్ల కొనుగోలుపై 40 శాతం రాయితీ కల్పిస్తున్నారు. భారీగా పెరిగిన బీమా సౌకర్యం మత్స్యకారుల భద్రతకు కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని భారీగా పెంచారు. గతంలో రూ. 2 లక్షలుగా ఉన్న ఈ బీమాను ఇప్పుడు రూ. 10 లక్షలకు పెంచారు. అలాగే, సాధారణ మరణం లేదా ప్రమాదం సంభవించినా కార్మిక శాఖ ద్వారా రూ. 2 లక్షల పరిహారం అందుతుంది. ఈ బీమా సౌకర్యాలు పొందాలంటే మత్స్యకారులు తప్పనిసరిగా సహకార సంఘంలో సభ్యులై ఉండాలి. అలాగే, ఫిషింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు కలిగి ఉండి, మత్స్యశాఖ అధికారుల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం సమీపంలోని మత్స్యశాఖ కార్యాలయాలను లేదా గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

# అక్రమముగా మూగజీవాలను తరలిస్తే కఠిన చర్యలు.

**-అక్రమంగా తరలిస్తున్న 21 పశువులను గోశాలకు తరలించిన కిర్లంపూడి ఎస్సై,జి సతీష్.**

**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్, 11:** అక్రమంగా మూగజీవాలను తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కిర్లంపూడి ఎస్సై,జి సతీష్ హెచ్చరించారు. కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి అక్రమంగా మూడు వాహనాల్లో ఊపిరాడకుండా తరలిస్తున్న 21 దున్నపోతులను కనుగొని గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా కిర్లంపూడి ఎస్సై జి సతీష్ మాట్లాడుతూ తమకు వచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి కిర్లంపూడి టోల్ ప్లాజా వద్ద వాహనాలుఆపి తనిఖీ చేయగా అక్రమ పశువుల రవాణా గుట్టు రట్టయిందన్నారు. దీంతో అక్రమ రమణాకు ఉపయోగించిన మూడు వాహనాలను సీజ్ చేయడమే కాకుండా, రవాణా చేస్తున్న వ్యక్తులు పై కేసు నమోదు చేసి



చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ఆలమూరుకు తీరనున్న డ్రైనేజీ కష్టాలు

**రూ.23 లక్షలతో మూడు కల్వర్టులు**

**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 11;**మండల కేంద్రమైన ఆలమూరు గ్రామాన్ని ఎన్నో ఏళ్లగా వెంటాడుతున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.23 లక్షలతో మూడు కల్వర్టులు నిర్మిస్తున్నారు. జొన్నాడ-మండపేట ఆర్ అండ్ బి ప్రధాన రోడ్ లో ఉన్న మూడు కల్వర్టులను సుమారు అయిదు దశాబ్దాల క్రితం నిర్మించారు. అవి చిన్నవి కావడంతో గ్రామంలో మురుగునీరు బయటకు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గ్రామస్తులు,కూటమి నాయకులు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆర్ అండ్ బి మంత్రితో చర్చించి ఈ నిధులను మంజూరు చేయించారు.తూరలతో ఈ కల్వర్టులను నిర్మిస్తున్నారు. రాకపోకలకు అంతరాయం లేకుండా రాత్రి సమయాల్లో పనులు చేపడుతున్నారు. ఇప్పటికే సిద్ధార్థ స్కూల్ రోడ్(వినాయకుని ఆలయం సమీపంలో) కల్వర్టుకు సంబంధించి తూరలు ఏర్పాటు చేశారు. అలాగే బస్టాండ్ ఇవతల మలుపులో మరో కల్వర్టు నిర్మిస్తారు.ఇంకొకటి ప్రభుత్వ ఆసుపత్రి దాటిన తర్వాత ఉండే మలుపులో నిర్మించనున్నారు.వీటి నిర్మాణం పూర్తయితే ఆలమూరులో అనేక డ్రైనేజీల నుంచి వచ్చే మురికినీరు స్తంభించకుండా బయటికి వెళ్లే అవకాశం ఉంటుంది.వీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు ఆ గ్రామస్తులు,కూటమి నాయకులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



# పెనికేరులో రామాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 11;**ఆలమూరు మండలం పెనికేరు ఎస్సీకాలనీలో పునర్నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయం ప్రారంభోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తుల సహకారంతో ఆలయం పునర్నిర్మాణం చేపట్టారు.గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ఈదర చిన్నబాబు రూ. 2లక్షల ఆర్థిక సాయం అందించారు. ఆలయ ప్రారంభోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక హోమాలు జరిపారు. ఈ సందర్భంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టిడిపి నాయకుడు ఈదర చిన్నబాబు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు, చిన్నబాబులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షులు ఈదల సత్తిబాబు, నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, రాంబాబు, గొడవర్తి భాస్కరరావు, కోన దత్తుడు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కళ్ళజోళ్లు పంపిణీ



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 11;**మండల కేంద్రమైన ఆలమూరులో ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్, ఏజిపి బూసి విద్యా ప్రసన్న నేతృత్వంలో సోమవారం ఉచిత కళ్ళజోళ్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ముఖ్య అతిథులుగా టిడిపి మండల అధ్యక్షులు ఈదల సత్తిబాబు,కాకినాడ సత్యం స్టడీ సర్కిల్ అధినేత బూసి విద్యా సాగర్ హాజరయ్యారు. గత నెల 28వ తేదీన నిర్వహించిన కంటి పరీక్షలలో గుర్తించిన దృష్టి లోపాలున్న సుమారు 57 మంది రోగులకు కళ్ళజోళ్లు అందజేశారు. అనంతరం విద్యాసాగర్ సతీమణి స్వర్గీయ బూసి ఝాన్సీ రాణి జన్మదినోత్సవం సందర్భంగా ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ విద్యా ప్రసన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలు చేరేలా చేయడం తమ ట్రస్ట్ ముఖ్య లక్ష్యమన్నారు.ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం చేపడతామని తెలిపారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ చేస్తున్న సేవలను అభినందిస్తూ,వాళ్లు కష్టపడి సంపాదించిన దానిలో కొంత భాగాన్ని సమాజ సేవకు వినియోగిస్తూ ముందుకు రావడం ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మంచి మార్పుకు దారి తీస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈదల నల్లబాబు, చీపురపల్లి గణేష్, మానేపల్లి శ్రీనివాస్, లంక శ్యామ్, నెల్లి చిన్న, దిడ్డి రాము, బూసీ చిట్టి కుమార్, ముప్పిరి వెర్రియ్య తదితరులు పాల్గొన్నారు.

# పండగే పండగ....







- ఆదిత్య యూనివర్సిటీలో ఎచీవర్స్ డే వేడుకలు
- ప్రతిభకు పట్టాభిషేకం చేసిన యాజమాన్యం
- 4400 మంది 255 కంపెనీలలో ఉద్యోగాలు
- ఆనందోత్సవాలలో విద్యార్థుల తల్లిదండ్రులు

**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 11:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం పండగే పండగ అన్నట్లు ఘనంగా ఎచివర్స్ డే జరుపుకోవడంతో వాతావరణం సందడిగా మారింది. 2025, 26 సంవత్సరానికి గాను వివిధ ప్రాంతాల నుండి వివిధ భాషలతో ఒకే ప్రాంతంలో ఒకే క్యాంపస్ లో బీటెక్ చదువుతున్న విద్యార్థులకు 4, 400 పైబడిన విద్యార్థులు 255 వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులతో కోటి దీపాల కాంతుల వలె ఒక పండగల మారిపోయింది. విద్యార్థుల కు వారి తల్లిదండ్రులకు వచ్చిన ఆనందం కంటే తమ యూనివర్సిటీలో విద్యన అభ్యసించే విద్యార్థినీ విద్యార్థులు సుమారు 5,000 మందికి ఉద్యోగాలు రావడం పట్ల యాజమాన్యం చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి లతోపాటు అధ్యాపక బృందం ఎంతగానో ఆనందం వ్యక్తం చేశారు. ఇవి మొదటిసారి కాదు అయినప్పటికీ ప్రతి సంవత్సరం ఆదిత్య యూనివర్సిటీలో కొత్తగా ఇదొక పండగల జరుపుకునే కార్యక్రమం. ఈ పండగ వాతావరణం లో విద్యార్థిని విద్యార్థులతో పాటు యాజమాన్యం అధ్యాపక బృందం ఆనందంతో గడిపారు. ముఖ్యంగా వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి ఉద్యోగాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులతో స్వయంగా తాను కలిసి ముచ్చటించారు. వారి యొక్క అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రతిభకు పట్టాభిషేకం అన్నట్లు వారిని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ప్రతిభ గల విద్యార్థులను అందించినందుకు తమపై నమ్మకంతో ఉంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రో. ఛాన్సలర్ డా. ఎన్. సతీష్ రెడ్డి సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలో చేరిన మొదటి రోజు మీ చిన్నారులను నాలుగు సంవత్సరాల అనంతరం బీటెక్ పట్టా తో పాటు మంచి కంపెనీలో ఉద్యోగ నియామక పత్రం తో మీకు అప్పగిస్తామనే మాటను నిజం చేస్తూ ఈ రోజు ఈ ఆనంద క్షణాలు మీతో పంచుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది అని, ఇది ఆరంభం మాత్రమే అని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉద్యోగంకల్పించాలనే కృతనిశ్చయంతో మా సంపూర్ణ కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సంవత్సరం అత్యుత్తమ వార్షిక వేతనం 39.6 లక్షలు,31లక్షలు,29లక్షలు వంటి 20 లక్షలు కు పైగా వార్షిక ప్యాకేజీ లతో 30మంది,10 లక్షల వార్షిక వేతనం ఆ పైన 55మంది మొత్తం 4400 పైగా విద్యారులు 251కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందదాయకం అని సతీష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లితండ్రులు మాట్లాడుతూ తమ చిన్నారులను ఎంతో నమ్మకంతో ఆదిత్య సంస్థ లో చేర్పించినందుకు మా చిన్నారులకు వెలకట్టలేని క్రమశిక్షణతో కూడిన విద్య ను అందించడమే కాకుండా బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ మంచి వార్షిక ఆదాయం తో కూడిన ఉద్యోగం కూడ అందించిన ఆదిత్య యాజమాన్యం కు ఎంతో రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో. ఛాన్సలర్. డా. ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డా. ఎం.బి. శ్రీనివాస్, ప్రో. వైస్ ఛాన్సలర్స్ . డా. ఏ. రమేష్, డా. ఎస్.రమాశ్రీ, డా. రవి తంగజం, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, వివిధ విభాగాల డీన్ లు వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది ప్లేస్ మెంట్ విభాగం సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే

- **ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,ఏప్రియల్11:** సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి,స్త్రీ విద్యావ్యాప్తికి కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అన్నారు.ప్రముఖ సామాజిక విప్లవ కారుడు మహాత్మ జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకలు సందర్భంగా ప్రత్తిపాడు మండలం,పెదశంకర్లపూడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే సత్యప్రభ రాజా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు ఆయన జీవితాంతం కృషిచేశారన్నారు.బాలికా విద్య ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విద్య,సామాజికన్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతారన్నారు.అటువంటి మహనీయున్ని నిత్యం ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఆయనను స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయ సాధనకు అందరం కృషిచేద్దామని పిలుపునిచ్చారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రజా దర్బార్‌లో వినతులు -మంత్రి సుభాష్



**రామచంద్రపురం, పెన్ పవర్, ఏప్రిల్ 11:** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను నేరుగా మంత్రికి తెలియజేశారు.ఈ సందర్భంగా ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య పింఛన్లు, దివ్యాంగ పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల కోసం మొత్తం 48 వినతిపత్రాలు అందాయి. ప్రతి అర్జీని స్వీకరించిన మంత్రి, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎటువంటి ఆలస్యం సహించబోమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండటం తన బాధ్యత అని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, గంధం పల్లంరాజు, వాసంశెట్టి సత్యం, అక్కల రిశ్వంత్ రాయ్, పోలిశెట్టి చంద్రశేఖర్ తదితర నాయకులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## మల్లేపల్లి లో పోషణ పక్వాడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిడిపిఓ పూర్ణిమ





**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 11:**గండేపల్లి మండలం మల్లేపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ వారోత్సవాలలో భాగంగా శనివారం సూపర్వైజర్ నాగ పార్వతి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ జగ్గంపేట ప్రాజెక్టు అధికారిని పూర్ణిమ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు మెదడు అభివృద్ధి చెందుతుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి అలవాట్లు అలవర్చుకునే విధంగా నేర్పాలని సూచించారు. ఆకుకూరలు కూరగాయలు పప్పు దినుసులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. పిల్లలకు చిప్స్ నూడిల్స్ డ్రింకులు వంటివి ఇవ్వడం వలన చిన్న వయసులో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని రక్తపోటు వస్తుందని హెచ్చరించారు. అధిక బరువు పెరిగి మధుమేహం వచ్చే ప్రమాదం ఉందన్నారు. పిల్లలలో ఏకాగ్రత లోపం మానసిక స్థితి మార్పులు వస్తాయని సూచించారు. ఏడు నెలల నుండి మూడు సంవత్సరముల వరకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం ఇవ్వడం జరుగుతుందని పిల్లలకు తప్పనిసరిగా బాలామృతాన్ని తినిపిచుట ద్వారా పౌష్టి కరమైన ఆహారం అందుతుందన్నారు. ప్రతి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని ఆయా కేంద్రాల ద్వారా అర్హులైన వారు పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం సిడిపిఓ పూర్ణిమ చిన్నపిల్లలకు స్వయంగా బాలామృతం తినిపించారు. అనంతరం పురుషులతో వంటలు చేయించే విధానం చూపించారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పార్వతి తల్లులు పిల్లలు అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా



**రావులపాలెం, పెన్ పవర్ ఏప్రిల్ 11:**మహనీయ సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని రావులపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కొత్తపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ రౌతు ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.కార్యక్రమం ప్రారంభంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రౌతు ఈశ్వరరావు మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే భారతదేశంలో సామాజిక సమానత్వానికి మార్గదర్శకుడిగా నిలిచారని పేర్కొన్నారు.

వెనుకబడిన వర్గాలు, బడుగు బలహీన వర్గాలు, మహిళల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అమూల్యమని అన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నమ్మి పేదలకు విద్యను అందించడానికి ఆయన జీవితాంతం పోరాడారని వివరించారు. సమాజంలో అణగారిన వర్గాలకు ఆత్మవిశ్వాసం నింపి, వారికి నూతన దారులు చూపించిన మహానుభావుడు పూలే అని కొనియాడారు.ఇలాంటి మహనీయుల జయంతులను గ్రామ గ్రామాన జరుపుకోవడం ద్వారా యువతలో సామాజిక చైతన్యం పెంపొందుతుందని, వారి ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, మహిళా కార్యకర్తలు పాల్గొని జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమం సాదాసీదాగా కాకుండా ఉత్సాహభరితంగా సాగి పాల్గొన్న వారిలో స్ఫూర్తి నింపింది.

## పూలే ద్విశత జయంతి వేడుకలు -- ఆశయ సాధనకు కృషి చేయాలి: మంత్రి సుభాష్



**రామచంద్రపురం, పెన్ పవర్,ఏప్రిల్ 11:** జ్యోతిరావు పూలే ద్విశత జయంతి సందర్భంగా రామచంద్రపురంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభివృద్ధి, మహిళల విద్య కోసం పూలే చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆర్టీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన చలివేంద్రం,పులిహార పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్య, సమానత్వం,కుల వివక్ష నిర్మూలన కోసం పూలే చేసిన కృషిని కొనియాడుతూ,ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

# జొన్నాడలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు





**సామాజిక చైతన్యానికి మార్గదర్శి పూలే ఆశయాలు**

**ఆలమూరు పెన్ పవర్ ఏప్రిల్ 11:**మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని జొన్నాడ గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహించడం సామాజిక చైతన్యానికి ఉన్నత మార్గమని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ఒక గొప్ప సామాజిక సంస్కర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రధాతగా నిలిచారని తెలిపారు. మహిళల విద్యకు తొలి అడుగు వేసి బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాల ప్రారంభించడం మాత్రమే కాకుండా, తన భార్య సావిత్రిబాయి పూలే స్వయంగా విద్యాబోధన చేసి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దడం ఆ కాలంలో విశేష సామాజిక విప్లవమని కొనియాడారు.

1873లో స్థాపించిన “సత్యశోధక సమాజ్” ద్వారా కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి బడుగు బలహీన వర్గాలలో స్వాభిమానాన్ని పెంపొందించారని వివరించారు. “శేతకార్యాచా ఆసుడ్” రచనలో రైతుల దోపిడీని తీవ్రంగా విమర్శించి, నేటి వ్యవసాయ సమస్యలను అప్పుడే గుర్తించిన దూరదృష్టి గల నాయకుడిగా ఆయన నిలిచారని అన్నారు.సమాన విద్యా అవకాశాలు, కుల వివక్ష నిర్మూలన, మహిళా సాధికారత, రైతుల గౌరవం, శ్రమజీవుల హక్కులు -- ఇవే పూలే ఆశయాలుగా పేర్కొన్నారు. “సమానత్వం, స్వాభిమానం, విద్య” అనే మూడు సిద్ధాంతాలే సమాజ అభివృద్ధికి పునాది అని చెప్పారు.యువత విద్యపై దృష్టి పెట్టి సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పాలని, కుల వివక్షకు వ్యతిరేకంగా నిలబడాలని, మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఇంటి నుంచే మార్పు ప్రారంభమై సమాజానికి విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై కూడా వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “సబ్కా సాథ్, సబ్కా వికాస్” నినాదంతో పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా, విద్యా రంగంలో రిజర్వేషన్లు, స్వయం ఉపాధి పథకాలు, మహిళా సాధికారత, రైతు సంక్షేమ కార్యక్రమాలు వంటి అనేక చర్యలను ప్రస్తావించారు.

పూలే గారి ఆశయ సాధన ఇంకా కొనసాగాల్సి ఉందని, ఆయన చూపిన మార్గాన్ని అనుసరించడం ద్వారానే సమాన సమాజ నిర్మాణం సాధ్యమని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు అయినవిల్లి సత్తిబాబు గౌడ, బట్టి శీను, మేడపాటి రాము, సుంకర శ్రీరాములు, పవన్, బుర్ర ఆంజనేయులు, కట్ట ప్రసాద్, సందీప్, టేకుమూడి సూరిబాబు, కర్రీ గంగిరెడ్డి, ఎన్.రంగారావు గౌడ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడలకు గొల్లపాలెం విద్యార్థుల ఎంపిక






**కాజులూరు, పెన్ పవర్,ఏప్రిల్ 11:** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొల్లపాలెం విద్యార్థులు నలుగురు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది.పాఠశాల హెడ్ఎం సుశీలామణి తెలిపిన వివరాల ప్రకారం, పులివెందులలో జరిగిన అండర్-14 సాఫ్ట్ బాల్ పోటీలలో జె. జయకృష్ణ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 16 నుంచి 22 వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.అలాగే చిత్తూరు జిల్లా పలమనేరు లో జరిగిన అండర్-14 బేస్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో కె. లోకేశ్వరి దీపిక, డి. సంగీత, డి. ఆదర్శ్ విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల పీడీ జి. సునీల్ కుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ప్రయాణ ఖర్చుల కోసం చందాల ఆదినారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చందాల ఆదినారాయణ, రిటైర్డ్ బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సనపల ధనరాజు ఆర్థిక సహాయం అందజేశారు.జాతీయ స్థాయిలో కూడా రాణించి గ్రామానికి పేరు తీసుకురావాలని గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ జె. రాంబాబు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అంగర కృష్ణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముర్రే శివశంకర్, గ్రామ టీడీపీ అధ్యక్షులు నక్క శ్రీను, అంగర శ్రీను,చందాల మల్లిబాబు, ఉపాధ్యాయులు ఇమ్మానుయేల్ రాజ్, ప్రసాద్,గంగరాజు,దుర్గారత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఘాటీ సెంటర్‌లో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 10:** కాకినాడ ఘాటీ సెంటర్‌లో జ్యోతిరావు పూలే 200వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మాన్ని దళిత గిరిజన బీసీ ముస్లిం క్రైస్తవ ఐక్యవేదిక అధ్యక్షులు భద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు కె. నాగేశ్వర రావు, కోర్నెల్ బాబు మధు తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ, పూలే తన కాలంలో కుల వివక్షను ధైర్యంగా ఎదుర్కొని సమాజంలో సమానత్వం కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు.అణగారిన వర్గాలకు విద్య అందించడంలో ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ, తన భార్య సావిత్రిబాయి పూలే సహకారంతో దిగువ వర్గాల పిల్లల కోసం పాఠశాలలను స్థాపించి విద్య ప్రాముఖ్యతను తెలియజేసిన గొప్ప వ్యక్తిత్వం కలిగిన నాయకుడని పేర్కొన్నారు.ప్రస్తుత సమాజంలో కుల వివక్ష ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో దళిత, గిరిజన,బీసీ,ముస్లిం,క్రైస్తవ వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు వచ్చి మహానుభావుల ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, లాజరు, దూలంపూడి రవి, ఉమాశంకర్, వెంకట దుర్గాప్రసాద్,మధు,మందపల్లి అప్పారావు,విజయ్, సూరిబాబు, నాగరాజు,రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 2 జయంతి వేడుకలు





**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 11:** జ్యోతిరావు పూలే 200వ జయంతి సందర్భంగా కాకినాడలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వా సుపత్రి సమీపంలోని పూలే విగ్రహం వద్ద జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్,ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం,కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు,కాకినాడ మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ, అంటరానితనం నిర్మూలన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, మహిళల అభివృద్ధి కోసం పూలే చేసిన సేవలు అపారమని కొనియాడారు. సమాజంలో అసమానతలను తొలగించేందుకు ఆయన చేసిన ఉద్యమాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ, సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు పూలే ఆద్యుడు అని తెలిపారు. కులవ్యవస్థ నిర్మూలన, స్త్రీ-పురుష సమాన హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని చెప్పారు. అలాగే సావిత్రిబాయి పూలే మహిళల విద్యకు చేసిన కృషిని గుర్తుచేశారు.ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ, విద్య ద్వారానే అసమానతలను తొలగించవచ్చని నమ్మకంతో పూలే చేసిన సేవలు సమాజానికి మార్గదర్శకమని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు,బీసీ కార్పొరేషన్ ప్రతినిధులు,ప్రజాప్రతినిధులు,వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు జగ్గంపేట పోలీసులు ప్రత్యేక చర్యలు



అనధికార డివైడర్లు మూసివేత

**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 11:** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జగ్గంపేట పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా జగ్గంపేట జాతీయ రహదారిపై అనధికారికంగా ఉన్న డివైడర్లను గుర్తించి వాటిని మూసివేస్తున్నారు. శనివారం జగ్గంపేట నుంచి రామవరం వెళ్లే రహదారిలో అనధికార డివైడర్ ను జగ్గంపేట సిఐ బి. తిరుపతిరావు, ఎస్సై టి. రఘునాధరావు సిబ్బందితో కలిసి మూయించి వేశారు. అలాగే జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లు గుర్తించామని తెలిపారు. ఎక్కడ ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ప్రజలు కూడా రహదారి భద్రత నిబంధనలు పాటించాలని పోలీసులు కోరారు.

# జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి - డాక్టర్ పినిపే శ్రీకాంత్




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 11:** మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతిని పురస్కరించుకుని, నేడు అమలాపురం నియోజకవర్గ వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు.

అమలాపురం గోకులే సెంటర్ పార్కు వద్ద ఉన్న పూలే విగ్రహానికి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తోందని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయేల్ ,కుడుపూడి సూర్యనారాయణరావు ,రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు ,వంటెద్దు వెంకన్నాయుడు ,నా.జు.జ మెంబర్ కుడుపూడి భరత్ ,జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మట్టపర్తి నాగేంద్ర ,మాజీ మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్యనగేంద్ర మణి రాష్ట్ర,జిల్లా,నియోజకవర్గ,మండల,నాయకులు,కార్యకర్తలు,అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు




## రమణయ్యపేటలో ఘనంగా పూలే జయంతి



**ఉచిత కంటి వైద్య శిబిరం**

**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఏప్రిల్ 11:** సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని రమణయ్యపేటలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కిరణ్ కంటి ఆసుపత్రి యాజమాన్యం, ఎంపీ సానా సతీష్ బాబు సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ సీనియర్ నాయకులు,మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,పూలే ఆశయ సాధనలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ శిబిరంలో సుమారు 120 మందికి పైగా రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంటి ఆసుపత్రి సిబ్బంది అందించిన సేవలను, సానా సతీష్ బాబు ఫౌండేషన్ చేపడుతున్న సామాజిక కార్యక్రమాలను నిర్వాహకులుప్రశంసించారు.కార్యక్రమంలో భాగంగా జనరల్ ఆసుపత్రి సమీపంలోని పూలే విగ్రహానికి, అనంతరం టీడీపీ కార్యాలయం మరియు బీసీ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కొండా వినాయక్, పాలికి సతీష్, మహేష్, సిరియాల కొండబాబు, యనమదల రవి, పెంకే గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతి రావు పూలె జయంతి వేడుకలు



**గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే**

**అల్లవరం, పెన్ పవర్, ఏప్రిల్ 11:**అల్లవరం స్థానిక హైస్కూల్ సెంటర్ నందు శనివారం ఎంపిపి ఇళ్ల శేషగిరి రావు ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశంలో సామాజిక సంస్కరణలు, విద్యా అభివృద్ధి మరియు సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే ఒక గొప్ప సంఘ సంస్కర్తగా గుర్తింపు పొందారని కొనియాడారు.భారతదేశంలో మొదటి బాలికల పాఠశాల ప్రారంభం చేసి మహిళల విద్యకు పోరాటం చేశారని అన్నారు. అదేవిధంగా సత్యశోధక సమాజ్ స్థాపించి దళితుల హక్కుల కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. అణచివేతకు వ్యతిరేకంగా ప్రచారం మరెన్నో ఉద్యమలు చేసిన మహానీయుడని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపి నాయకలు యాళ్ల దొరబాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ ఎన్ మౌనిక

బిజెపి నాయకలు యాళ్ల దొరబాబు,కట్టా నారాయణ మూర్తి,చొల్లంగి వెంకట రమణ, కుడిపూడి సామ్రాట్, మామిడిశెట్టి చిన్న, పితాని శేఖర్, మామిడి శెట్టి శ్రీరామ్, బొక్కా ప్రసాద్, బొక్కా శ్రీను,వాసర్ల సూర్యనారాయణ,అడపా శ్రీనివాస్, కొల్లు రవి వర్మ,గూడాల పుల్లం శెట్టి,మార్గం శ్రీనివాస్, అడపా శ్రీనివాస్ అక్కి శెట్టి వీరభద్రరావు పాల్గొన్నారు.

## షిరిడి సాయిబాబా, దత్తాత్రేయ, గణపతి విగ్రహ ప్రతిష్టకు అంకురార్పణ



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 11:** స్థానిక గోకవరం రోడ్ లోని నూతన షిరిడి సాయి ఆలయంలో ఈనెల 12వ తేదీన నిర్వహించే షిరిడి సాయినాథ్, దత్తాత్రేయ స్వామి, గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి శనివారం జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు జీనుమణి బాబు విజయలక్ష్మి దంపతులు విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించి అనంతరం హోమం నిర్వహించారు. నూతన విగ్రహాలకు క్షీరాభిషేకం, జలాభిషేకం, ధాన్యాది షేకం నిర్వహించి మండపారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఈ విగ్రహాలను ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మణి దంపతులు, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి హాజరవుతారు. భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా పాత్ర కీలకం





**-ఎంపీ హరీష్ మాధుర్ బాలయోగి**

**అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 11:**ప్రజా సమస్యలు పరిష్కారం లో

మీడియా పాత్ర మరింత కీలకమని అమలాపురం ఎంపీ హరీష్ మాధూర్ బాలయోగి అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి అనేక సమస్యల పరిష్కారానికి దిక్సూచి వంటి వారని మీడియా ప్రతినిధులను కొనియాడారు. ది అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్టు అంబాజీపేట (ప్రెస్ క్లబ్) భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పళ్ళ సూర్యప్రకాశరావు ( బాబ్జి) అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో విలేకరులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. తన పార్లమెంట్ పరిధిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక మీడియా హౌస్ నిర్మాణం చేపడతామన్నారు. మీడియా అక్రిడిటేషన్, రైల్వే పాస్ తదితర సదుపాయాల గురించి ప్రభుత్వంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. పి. గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ

నిష్పక్షపాతంగా వార్తలు ప్రజలకు అందించాలని అప్పుడే జర్నలిస్టు లకు మంచిగుర్తింపు లభిస్తుందని అన్నారు.

ప్రజా ప్రతినిధులు, పత్రికా విలేకరులు సమాంతరంగా పనిచేసినప్పుడే సంఘంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. తన నియోజకవర్గంలో కొంతమంది విలేకరులు తనపై బురద చల్లె ప్రయత్నం చేస్తున్నారని ,ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు.పి. గన్నవరం ఆక్విడక్ట్ రిపేర్ల విషయంలో పలు నిందారోపణలు చేస్తూ పలు వార్తలు రాయడం తగదన్నారు. అంబాజీపేట ప్రెస్ క్లబ్ భవనానికి మరిన్ని నూతన సదుపాయాలు చేకూర్చే ప్రయత్నం చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎం.పిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటిసి బూడిద వరలక్ష్మి, నీటిపారుదల శాఖ రాష్ట్ర డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, బిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొంతు పెదబాబు, అంబటి భూలక్ష్మి, ఆత్మ డైరెక్టర్ పత్తి దత్తుడు, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎస్ శ్రీ నివాస్, తహశీల్దారు బి. చినబాబు, ఎం.పిడివొ బి. మమత, మాజీ ఎంపి చింతా అనురాధ, మాజీ సర్పంచ్ సుంకర సత్యవేణి బాలాజీ, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు, టిడిపి కోకన్వీనర్ దాసరి వివి సత్యనారాయణ, త్రిసభ్యకమిటి చైర్మన్ అరిగెల సూరిబాబు, కుడిపూడి రాంబాబు, రంపం సత్యనారాయణ, అల్లాడ రవి, ముత్యాల జమ్మిలు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, ప్రెస్ క్లబ్ కార్యదర్శి జుత్తిక రాంప్రసాద్, సభ్యులు, సి ఎన్ మూర్తి, మట్టపర్తి శ్రీ నివాస్, మద్దింశెట్టి శ్రీ నివాసు, ఇసుకపూడి ప్రఫుల్ కుమార్, గోసంగి శ్రీ ను, మాలే వెంకట దుర్గాప్రసాద్, కోన సత్తిబాబు, పేపకాయల రాజు, గుత్తుల ఏడుకొండలు, జల్లి విక్టర్ కుమార్, మహిపాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి-మంత్రి సుభాష్



**రామచంద్రపురం, పెన్ పవర్,ఏప్రిల్ 11:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు.శనివారం రామచంద్రపురం పట్టణంలోని పలు వస్త్ర, ఇతర దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులతో మంత్రి ముచ్చటించి, ఈ-శ్రమ్ కార్డులపై అవగాహన కల్పించారు. కార్మికులు ఈ-శ్రమ్ కార్డులు పొందారా లేదా అనే విషయాలను తెలుసుకొని, కార్డులు లేని వారికి వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. కొంతమంది కార్మికులకు స్వయంగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను చూపించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కార్మికులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించు కోవాలని, ముఖ్యంగా ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్ ధన్, ప్రధానమంత్రి లఘు వ్యాపారి మాన్ ధన్ పథకాల ప్రయోజనాలను పొందాలని తెలిపారు. సంఘటిత,అసంఘటిత కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ పి. మనోజ్, గుత్తుల సాయి, గంధం పల్లంరాజు, అక్కల రిశ్వంత్ రాయ్, పోలిశెట్టి చంద్రశేఖర్, వాసంశెట్టి సత్యం, ఉండవల్లి శివ తదితర నాయకులు పాల్గొన్నారు

## రావులపాలెం తెలుగుదేశం క్యాంప్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి వేడుకలు

- పూలే చిత్రపటానికి పూలమాలలను వేసి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**రావులపాలెం, పెన్ పవర్ ఏప్రిల్ 11:**ఆధునిక భారతదేశంలోని అగ్రగణ్య సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతిని పురస్కరించుకుని రావులపాలెంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు.

కార్యక్రమం ప్రారంభంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలే సమాజంలో సమానత్వం కోసం, అంటరానితనం నిర్మూలన కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడని కొనియాడారు. మహాత్మా గాంధీ కంటే ముందుగానే సామాజిక సంస్కరణల కోసం ఉద్యమం చేపట్టి సమాజంలో మార్పుకు పునాది వేశారని పేర్కొన్నారు.

మహిళల విద్యకు ప్రాధాన్యతనిస్తూ, సావిత్రిబాయి పూలే ద్వారా బాలికల విద్యను ప్రారంభించడం భారత చరిత్రలో ఒక కీలక ఘట్టమని అన్నారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రజల్లో చైతన్యం కలిగించిన మహనీయుడు పూలే అని వివరించారు.ఏప్రిల్ నెలలో జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల జయంతులు వరుసగా రావడం గర్వకారణమని అన్నారు. వారి ఆశయాలను ఆచరణలో పెట్టి సమాన సమాజ నిర్మాణం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే భవన్‌ను రావులపాలెంలో నిర్మించేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు సంబంధించిన స్థల సేకరణ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలోనే ఈ భవనం నిర్మాణం సాకారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులు, మహిళలు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు.

# నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు తనవంతు కృషి.

* వైసీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఏప్రియల్ 11:** నియోజకవర్గంలో నిరుపేద కుటుంబాలను,ఆదుకునేందుకు తనవంతు కృషి చేస్తానని ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చార్టబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు అన్నారు. ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామంలో సదాశివ నాగు ఇటీవల కాలంలో చెట్టు మీద నుంచి పడి గాయపడి, చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మురళీ కృష్ణంరాజు నాగును పలకరించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకోవడమే కాకుండా వారి కుటుంబానికి 5,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసారు.ఆ నిరుపేద కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్,,శరభవరం ఎంపీటీసీ అమరాది కాశీ,వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు,శరభవరం గ్రామ అధ్యక్షులు రంగనాథం అబ్బాయి,గజ్జినపూడి ఎంపీటీసీ మొల్లి వీరబాబు,ప్రత్తిపాడు ఎంపీటీసీ సేంద్రిపు భాస్కర్ రావు,సింధూరపు సుబ్బారావు,నామాల నాగబాబు,అమరాది బాబ్జి,గొనగాల అజయ్, గట్టు దొర,రామదేవు తమ్మారావు , రామిశెట్టి నాగబాబు,ముత్యం రాజబాబు, గొనగాల వెంకటరమణ ,బొల్లు నాగేశ్వరరావు,కోలా తాతబాబు,జువ్వల దొరబాబు,వార్డ్ నెంబర్ తాతపూడి బుజ్జి, వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు



# బీవీసీలో ల్యాబ్స్ ఇన్నోవేషన్ కేంద్రం.



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 11:**సిలికాన్ ల్యాబ్స్ సహకారంతో అమలాపురం రూరల్ మండలం భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఐఓటీ సెంటర్ ఆఫ్ ఇన్నోవేషన్ పరిశోధన కేంద్రాన్ని సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ డైరెక్టర్ ఎం వెంకటేష్, గ్లోబల్ టాలెంట్ అక్విజిషన్ డైరెక్టర్ జాన్సన్ లు ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి బీవీసీ చైర్మన్ బోనం కృష్ణ సతీష్ , మేనేజింగ్ డైరెక్టర్ బి. విజయలక్ష్మి హాజరై పరిశ్రమ–విద్యాసంస్థల అనుసంధానంపై వివరించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జెవిజి రామారావు, ఏఓ జెవి కృష్ణారావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టి.ఎస్.ఎస్. ఫణి, ఈఈఈ విభాగాధిపతి రాజగోపాల్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ బి.హెచ్. పవన్ సమన్వయం చేశారు. సిలికాన్ ల్యాబ్స్ నిపుణులు వెంకటేష్ నరసింహన్, శివాత్మిక మండా, దిలీప్‌కుమార్ త్రిపాఠి నిర్వహించిన వర్క్‌షాప్‌లో విద్యార్థులు ఐఓటీ సాంకేతికతలపై అవగాహన కల్పించారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే - - ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు.



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 11:** అణగారిన వర్గాల విద్యా సాధికారత, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ధీశాలి మహాత్మా జ్యోతిరావు పూలే అని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కొనియాడారు. శనివారం అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి.

* విద్యార్థులకు కిర్లంపూడి ఎస్సై, జి సతీష్ పిలుపు.





**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్, 11:** పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కిర్లంపూడి ఎస్సై,జి సతీష్ పిలుపునిచ్చారు.కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎస్సై,జి సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎస్సై,జి సతీష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవులు ఎడారులుగా మారడం వల్ల ప్రకృతి సమతుల్యం అవుతున్నదని,దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. మొక్కలు నాటడం వల్ల అది పెరిగి ఆ చెట్టు మనందరికీ చల్లని నీడతోపాటు మంచి మంచి ఆక్సిజన్ అందించడమే కాకుండా , అందరికీ మంచి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. తాను వ్యక్తిగతంగా చెప్పుకోవాల్సి వస్తే చిన్నతనం నుండి కష్టపడి చదువుకుని ఈ స్థాయికి వచ్చానని అసలు ఉపాధ్యాయ వృత్తికి వెళ్ళవలసిన వాడిని కొన్ని కారణాలవల్ల పోలీస్ ఉద్యోగం చేయవలసి వచ్చిందని అన్నారు. ఇప్పటినుండి విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాడి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖపట్నం పోర్ట్ వారి సహకారంతో పర్యావరణ పరిరక్షణ కోసం తమ పాఠశాలకు 500 సపోటా మొక్కలు పంపిణీ చేయడం జరిగిందన్నారు.పాఠశాలలో ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు మొక్కలు పంపిణీ జరుగుతుందని ప్రిన్సిపల్ గాడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు, పెంటకోట సత్యనారాయణ, తోట ఆశాజ్యోతి, దాడి సూరిబాబు మాస్టారు, పోలీస్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు,పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి పూలే



- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 11:** మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న పూలే విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రప్రభుత్వం పనివేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, నీటిపారుదల శాఖ రాష్ట్ర డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, గూడాల ఫణి, రవణం రాము, వైస్ ఎంపిపి నేతల నాగరాజు, దొమ్మేటి సాయికృష్ణ, నాగాబత్తుల సుబ్బారావు, పెదపూడి శ్రీ నివాసరావు, కత్తుల బాబులు, ఉందుర్తి నాగబాబు, పేరాబత్తుల పెద సుబ్బరాజు, పితాని ఈశ్వరరావు, కొప్పినీడి ఈశ్వరరావు, మిద్దుల శ్రీను, మేడిది శ్రీ ను, మట్టపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది



ఎమ్మెల్యే వేగుళ్ళ

**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 11 :** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తెలిపారు. మండలంలోని ద్వారపూడిలో ఏర్పాటుచేసిన రైతు సేవా కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ధాన్యం లోడుకు జెండా ఊపి ధాన్యం కొనుగోలు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన రైస్ స్టాల్ ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 11 :** పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,59,380, అన్నదాన విరాళాల ద్వారా రూ. 56,101, కేశ ఖండన ద్వారా రూ. 6,360, తులాభారం ద్వారా రూ. 650 లడ్డు ప్రసాదం ద్వారా రూ. 12,945, మొత్తం రూ. 2,35,436 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం, సుమారు రెండు వేల ఎనిమిది వందల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ మొయిళ్ళ సంధ్య, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# బీసీలకు గుర్తింపు ఇచ్చిందే పూలే.

మాజీ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి.



**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 11 :**దేశంలో వెనుకబడిన తరగతుల ఉనికి నీ గుర్తింపులోకి తెచ్చింది మహాత్మా జ్యోతి రావు పూలే అని మండపేట మాజీ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పేర్కొన్నారు.మండపేట లో శనివారం ఆమె అధ్వర్యంలో ఘనంగా జ్యోతి రావుపులే జయంతి వేడుకులు నిర్వహించారు. మండపేట పట్టణం లో పెద్ద కాలువ దగ్గర కరాచీ సెంటర్లో ఉన్న మహాత్మా జ్యోతి రావుపులే విగ్రహానికి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యోతిరావు పూలే బిసి సామాజిక సంక్షేమానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.బిసి ల ఆశయాలు ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. ఆయన వేసిన బాట లో బిసి లు ఐక్యంగా ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ప్రస్తుతం పోటీ సమాజం లో బిసి యువత కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. విద్య, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండపేట పట్టణ వైఎస్ఆర్సిపి అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్, సొసైటీ మాజీ చైర్మన్ పెంకే గంగాధర్ , మాజీ కౌన్సిలర్లు మొండి మురళి భవాని , ముక్కా దాలియా, మరిశెట్టి సత్యనారాయణ , షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ ఆలీ ఖాన్ బాబా, బిజెపి నాయకులు కోటిపల్లి సాయి రామ్, గోడవర్తి రామచంద్రరావు , బిసి సంఘం జాతీయ సంఘం పట్టణ అధ్యక్షుడు మల్లువలస గణపతి,జాతీయ బిసి సంఘాల కార్యదర్శి విరమల్లు శ్రీనివాస్,ఎమ్మార్పీఎస్ నాయకులు ధూళి జయరాజు,
గాలింకి నాగేశ్వరరావు,
బీసీ నాయకులు చుక్కల అప్పారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉండ్రసపు అర్జున్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నడిగట్ల నానాజీకి ముద్రగడ గిరిబాబు పరామర్శ.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,ఏప్రియల్,11:**శంఖవరం మండలం కొత్తంగి కొత్తూరు గ్రామ ఎంపీటీసీ నడిగట్ల నానాజీకి ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు.నానాజీ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు నానాజీ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకోవడమే కాకుండా,మెరుగైన వైద్యం తీసుకోవాలని సూచించి ఆయనకు ధైర్యం చెప్పారు. నానాజీ త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు.ఆయన వెంట శంఖవరం, ప్రత్తిపాడు మండలాల వైసీపీ అధ్యక్షులు నరాల శ్రీను, రామిశెట్టి నాని, ప్రత్తిపాడు వైస్ ఎంపీపీ బంకు శ్రీను, దూడల శివకుమార్, ఎం శ్రీను,ఎం మంగారావు, చంటి పలువురు స్థానిక వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# తాళ్లూరులో జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ





**గండేపల్లి, పెన్ పవర్ ఏప్రిల్ 11** గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పంపన రామకృష్ణ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ పాల్గొని విగ్రహాలు ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేసి కేకు కట్ చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే ఒక వ్యక్తి కాదు అనగారిన బడుగు బలహీన వర్గాల వారికి ఆశా జ్యోతి అని తెలియజేశారు స్త్రీలు చదువుకొని ఉంటే కుటుంబ బాగుంటుందని ఆయన ఆకాంక్షించారు సావిత్రిబాయి పూలేను చదివించి భారతదేశపు మొట్టమొదట ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారు ఆమె అందరకు విద్యను బోధించి ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దారని తెలియజేశారు. జ్యోతిరావుపూలె ఏదో ఒక కులాన్ని కాకుండా అన్ని కులాల వారికి ఆదర్శప్రాయుడని ఆయన ఆశయాలను మనం గుర్తుంచుకోవాలని ఆయన అడుగుజాడల్లో నాతోపాటు మనమందరం కలిసి నడవాలని అప్పుడే మనం ఆయనకు గౌరవం ఇచ్చినట్లు అవుతుందని తెలియజేశారు. జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఇచ్చిన దాత తాళ్లూరు గ్రామానికి చెందిన బీసీ నాయకులు తాళ్ల వీర వెంకట సత్యనారాయణ సత్యనారాయణ క్లాస్ 1 కాంట్రాక్టర్, ఈ విగ్రహాలు ప్రతిష్ఠించడానికి కావలసిన పునాది దిమ్మను తాజా మాజీ సర్పంచ్ శీలా మంతుల వీరబాబు ఏర్పాటు చేసి ఉన్నారు ఈ కార్యక్రమానికి బీసీ జాతీయ ఉపాధ్యక్షులు కుండల సాయి,బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పంచకట్ల రామకృష్ణ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు వియ్యపు అప్పలస్వామి, బి సి నాయకులు ఒమ్మి రఘురామ్ తాళ్లూరు బిసి సంక్షేమ సంఘం కమిటీ నాయకులు, సభ్యులు,తాళ్లూరు గ్రామ పెద్దలు నాయకులు తాళ్లూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఏడువారాల వెంకన్న దర్శనానికి భక్తులు రద్దీ



స్వామి దర్శనానికి కర్నూలు జిల్లా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి దంపతులు





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 11:**కోనసీమలోని వాడపల్లి ఏడువారాల వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది. శనివారం వేకువజామునే వేలాదిమంది భక్తులు స్వామివారి దర్శనార్థం ఆలయానికి తరలివచ్చారు. ప్రత్యేకంగా ఏడువారాల వెంకన్న దర్శనం కోసం రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఆలయ పరిసరాలు భక్తి సంద్రంలా మారాయి.ప్రాతఃకాల వేళ ఆలయంలో నిర్వహించిన సుప్రభాత సేవ, మేలుకొలుపు సేవ, అలంకరణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు వేదమంత్రాల మధ్య స్వామివారిని మేలుకొలిపి, అందమైన పుష్పాలంకరణలతో దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం నిర్వహించిన మొదటి హారతి సమయంలో భక్తులు "గోవిందా గోవిందా" నినాదాలతో ఆలయాన్ని మార్మోగించారు. ఆ క్షణంలో స్వామివారి దర్శనం పొందిన భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, తాగునీరు, ప్రసాదం పంపిణీ వంటి ఏర్పాట్లు చక్కగా నిర్వహించినట్లు ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు తెలిపారు. భక్తులకు సురక్షితంగా, సౌకర్యవంతంగా దర్శనం కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

సాయంత్రం సమయంలో ప్రముఖులు కూడా స్వామివారిని దర్శించుకున్నారు. కర్నూలు జిల్లా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ మున్నూరు వెంకటరాజు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.మొత్తంగా, వాడపల్లి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమాలు భక్తి, భవ్యం, సంప్రదాయాల సమ్మేళనంగా నిలిచాయి. భక్తుల రద్దీ ఉన్నప్పటికీ సమర్థవంతమైన నిర్వహణతో దర్శనం సాఫీగా కొనసాగడం విశేషం. ఏడువారాల వెంకన్న దర్శనం పొందిన భక్తులు తమ మనోభిలాషలు నెరవేరాలని ప్రార్థిస్తూ ఆనందంతో తిరిగి వెళ్లారు.

## సాంఘిక దుచారాలను నిర్మూలనకు మహాత్మా జ్యోతిరావ్ పూలే కృషి

### పూలే కు నివాళులు అర్పించినమాజీ ఎమ్మెల్యే రౌతు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఏప్రిల్ 11** :సమాజంలోని సాంఘిక దురాచారాలను కుల వివక్షత రూపుమాపేందుకు మహాత్మ జ్యోతిరావు పూలే కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాష్ రావు, ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ జెఏసి చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా గోదావరి గట్టున ఉన్న పూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జ్యోతి రావు పూలే ద్విశత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో మొట్టమొదటి జ్యోతిరావు పూలే విగ్రహాన్ని పూలే చైతన్య వేదిక అధ్యక్షులు నయనాల కృష్ణారావు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూలే విగ్రహం ఎదురుగా ఉన్న 13 గజాల స్థలాన్ని అప్పటి జిల్లా కలెక్టర్ మాధవి లత సహకారంతో మాజీ ఎంపీ భరత్ రామ్ రూ 3.50 కోట్లు ఎంపీ ల్యాండ్స్ నుంచి నిధులు కేటాయించి పులే, అంబేద్కర్ భవనం నిర్మాణం చేశారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాష్ రావు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే మహిళా విద్యకు కృషి చేశారని అన్నారు అడుగు బలహీన వర్గాలు అభ్యున్నతికి విద్య ఒక్కటే మార్గమని మహిళా విద్యకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. బిజెపి ప్రభుత్వంలో కుల వివక్షత ఇంకా కొనసాగుతుందని అన్నారు. 72 సంవత్సరాల చరిత్రలో ఒక బీసీ వర్గానికి చెందిన మార్గాని భరత్ రామ్ రాజమండ్రి ఎంపీగా విజయం సాధించి అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఆయన హయాంలోనే రూ 3.50 కోట్లు తో పూలే, అంబేద్కర్ భవనం నిర్మాణం చేసినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసి వెంకట్రావు, మార్గాని సురేష్, , అరె చిన్ని, తిరగాటి దుర్గ, ముప్పన శ్రీను, మునీశ్వరరావు, పంపన శ్రీను, మహ్మద్ షబ్బీర్, సుందర్ సింగ్, సూరిబాబు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత. -సాయి ప్రసాద్



**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 11.** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని స్థానిక తహసీల్దార్ సాయిప్రసాద్ అన్నారు. గోపాలపురం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది చేత స్వచ్ఛ్ ఆంధ్ర చేయించారు. అనంతరం పలువురు రెవిన్యూ అధికారులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరం అన్నారు. ప్రతి ఒక్కరూ చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వెయ్యకుండా చెత్త తొట్టెలలో మాత్రమే వెయ్యాలన్నారు. ఇంటి పరిసరాలలో చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది వాటి కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని పరిశుభ్రతకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఎస్ఓ జోడాల వెంకట్, డిప్యూటీ తహసిల్దార్ హరీష్, సీనియర్ సహాయకులు నల్లరాజు, గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జొన్నాడలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలు



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 11;**సమానత్వం, స్వాభిమానం, విద్య ఈ మూడు కలగలిసిన మార్గమే మహాత్మా జ్యోతిభా పూలే అని భారతీయ జనతా పార్టీ నాయకులు అన్నారు. ఆలమూరు మండలం జొన్నాడ గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని శనివారం నిర్వహించారు.ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్ నేతృత్వంలో జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో తాడి శ్రీనివాసరెడ్డి (బట్టి శీను), మేడపాటి రాము, సుంకర శ్రీరాములు,పవన్,బుర్ర ఆంజనేయులు, కట్ట ప్రసాద్,వీరి సందీప్, టేకుమూడి సూరిబాబు, కర్రీ గంగిరెడ్డి, రంగారావు గౌడ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధార్థ స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




**ఆలమూరు, పెన్ పవర్,ఏప్రిల్ 11;**మండల కేంద్రంలోని శ్రీ సిద్ధార్థ పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే శనివారం స్కూల్ అధినేత కె.ముల్లారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయన యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులను ఫస్ట్ క్లాస్ కి ఆహ్వానిస్తూ డిగ్రీలు ప్రదానం చేశారు. ఇది విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని కలుగజేయడానికి ఇలాంటి కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని ఆయన అన్నారు. ఇలాంటి అద్భుతమైన కార్యక్రమం ప్రతి ఏటా మా పాఠశాలలో నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అలాగే సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్యాలు, వివిధ స్కిట్లు అందర్నీ ఎంతగానో ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపల్ గుణశేఖర్, ప్రైమరీ ప్రిన్సిపల్ జెస్సినా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఏప్రియల్ 11:** కాకినాడ జిల్లా నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన వేడుకలకు మేజిస్ట్రేట్ ఎల్ గోపినాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ ,ఎల్ గోపీనాథ్ మాట్లాడుతూ విద్య, సామాజిక న్యాయం, సమానత్వం పై ఆయన అలుపెరుగని పోరాటం చేసి గొప్ప సంఘసంస్కర్తగా మిగిలిపోయారన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు,జాయింట్ సెక్రటరీ, జి కామేష్, ట్రెజర్ పి నాగేంద్ర రాజు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ,భారతి,సీనియర్ న్యాయవాదులు బుగత శివ, మళ్ల గంగాధర్,చలం, నరసింహారావు ,ప్రకాశ్,కీలపర్తి శ్రీనివాసరావు,బి అశోక్ మంజూష,సూరిబాబు,ప్రసన్న వెంకటరెడ్డి పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# అభిషేక్-హెడ్ తుఫాన్ బ్యాటింగ్.. పంజాబ్ కింగ్స్ టార్గెట్ ఎంతంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్ తో జరుగుతున్న సన్ రైజర్స్ హైదరాబాద్ పంజా విసిరింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఎస్ఆర్?హెచ్ ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసకరమైన బ్యాటింగ్ తో విరుచుకుపడగా, మరోవైపు హెడ్ మాత్రం బౌండరీలు బాదుతూ పంజాబ్ బౌలర్లకు చుక్కలు చూపెట్టాడు. ఈ క్రమంలో అభి ఫాస్టెస్ట్ 50 అందుకున్నాడు. 18 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడీ లెఫ్ట్ హ్యాండర్. అతని దెబ్బకు సన్ రైజర్స్ హైదరాబాద్ స్కోర్ బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలో శశాంక్ సింగ్ బౌలింగ్ లో ఈ ఓపెనర్లు ఇద్దరు పెవిలియన్ కి చేరుకున్నారు. టాస్ ఓడి బ్యాటింగ్ కి దిగిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లు విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగారు. కానీ 9వ ఓవర్ వేసిన శాశంక్ సింగ్ బౌలింగ్ లో ఫస్ట్ బంతికే ట్రావిస్ హెడ్ (23 బంతుల్లో 5 ఫోర్లు 1 సిక్సులతో 38 పరుగులు) అవుట్ అయ్యాడు. హాఫ్ సెంచరీతో చెలరేగిన అభిషేక్ శర్మ (28 బంతుల్లో 5 ఫోర్లు 8 సిక్సులతో 74 పరుగులు)ని కూడా అదే ఓవర్లో శాశంక్ వేసి స్లో బాల్ కి వికెట్ ఇచ్చేసి అభి పెవిలియన్ కి చేరుకున్నాడు. దీంతో ఒకే ఓవర్లో రెండు వికెట్లు నష్టపోయి ఇబ్బందుల్లో పడింది.

అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ సన్ రైజర్స్ జట్టు నెట్ రన్ రేట్ తగ్గకుండా జాగ్రత్తగా బ్యాటింగ్ చేశారు.. ఈ క్రమంలో అర్షదీప్ బౌలింగ్ లో డీప్ వికెట్ మీదుగా ఆడిన భారీ షాట్ కి బౌండరీ లైన్ దగ్గర మార్కో యాన్సెన్ క్యాచ్ పట్టడంతో ఆరెంజ్ ఆర్మీ కెప్టెన్ ఇషాన్ ( 17 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్సుతో 27 పరుగులు) మైదానం వీడాడు. తర్వాత పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో అనికేత్ వర్మ-- క్లాసెన్ సుమారు 2 ఓవర్ల పాటు నెమ్మదిగా బ్యాటింగ్ చేశారు.

ఇక 16వ ఓవర్ నుంచి మళ్లీ బ్యాటింగ్ లో ఆరెంజ్ ఆర్మీ దూకుడు పెంచింది. యుజేంద్ర చాహల్ వేసిన మొదటి బంతిని సిక్స్, మూడో బాల్ ని ఫోర్ కొట్టి మంచి ఊపుమీదున్న అనికేత్ వర్మ (18) రనౌట్ అయ్యాడు. అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన సలీల్ ఆరోరా పెద్దగా ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. కేవలం 9 రన్స్ మాత్రమే చేసి వెనుదిరిగాడు. ఇక చివర్లో క్లాసెన్ కూడా పెవిలియన్ కి చేరడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు 219 పరుగులు చేసింది. పంజాబ్ కింగ్స్ ముందు 220 పరుగుల టార్గెట్ ఉంది. పంజాబ్ బౌలర్లలో శాశంక్ సింగ్, అర్షదీప్ సింగ్ తలో రెండు వికెట్లు తీసుకోగా, జేవియర్ బార్ట్‌లెట్ ఒక వికెట్ పడగొట్టాడు.

# అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్.. సన్‌రైజర్స్‌పై భారీ టార్గెట్‌ను ఊదేసిన పంజాబ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో పరుగుల వరద కొనసాగుతోంది. న్యూ చండీగఢ్ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై పంజాబ్ కింగ్స్ 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 220 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 7 బంతులు మిగిలి ఉండగానే కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (69 నాటౌట్), ప్రియాన్ష్ ఆర్య (57), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (51) హాఫ్ సెంచరీలతో చెలరేగి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. భారీ లక్ష్య ఛేదనలో పంజాబ్‌కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ సన్‌రైజర్స్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో పంజాబ్ గెలుపు సులువే అనిపించింది. అయితే, సన్‌రైజర్స్ బౌలర్ శివాంగ్ కుమార్ (3/33) ఒకే ఓవర్‌లో వీరిద్దరినీ ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 69 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. తనదైన శైలిలో బౌండరీలతో విరుచుకుపడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (28 బంతుల్లో 74) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. తన ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 8 భారీ సిక్సర్లతో విధ్వంసం సృష్టించాడు. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (38)తో కలిసి తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరి దూకుడుతో సన్‌రైజర్స్ భారీ స్కోరు చేయగలిగినా, బౌలర్ల వైఫల్యంతో ఓటమి తప్పలేదు. ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ చరిత్రలో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. డే/నైట్ మ్యాచ్‌లో 215కు పైగా పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించిన తొలి జట్టుగా నిలిచింది. ఈ భారీ ఛేదనతో పంజాబ్ జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు కాగా, మరోసారి బౌలింగ్‌లో విఫలమైన సన్‌రైజర్స్ కు నిరాశ తప్పలేదు.

# చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య కీలక మ్యాచ్.. ఈ పోరులో ఎవరు గెలుస్తారంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఆసక్తికరమైన పోరు జరగనుంది. ఈ మ్యాచులో గెలిచి టోర్నీలో ఖాతా ఓపెన్ చేయాలని ఎల్లో ఆర్మీ చూస్తుండగా.. చెన్నపై విజయం సాధించి గుజరాత్ పై ఒక్క రన్ తేడాతో ఓడిన బాధని దిగమింగుకోవాలని చూస్తుంది. దీంతో ఈ రెండు జట్లకి మ్యాచ్ గెలవడం చాలా ముఖ్యం. చెన్నై సూపర్ కింగ్స్ : ఈ సీజన్‌లో చెన్నై ఆటతీరు ఫ్యాన్స్ ని తీవ్ర నిరాశకు గురి చేస్తుంది. ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయిన సీఎస్‌కే, బ్యాటింగ్ వైఫల్యంతో ఇబ్బంది పడుతోంది. ఫామ్ కోల్పోయిన సంజూ శాంసన్ ఈ మ్యాచులో ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. జట్టుకు ఊరటనిచ్చే విషయం ఏమిటంటే, విధ్వంసకర బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ తుది జట్టులోకి రావడం. అతని రాకతో సీఎస్‌కే బ్యాటింగ్ లైనప్ మరింత బలోపేతం కానుంది.

ఢిల్లీ క్యాపిటల్స్ : అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు అద్భుతమైన ఫామ్‌లో ఉంది. గత మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన పోరులో కేవలం ఒకే ఒక్క పరుగుతో ఓడిపోయినప్పటికీ, ఆ జట్టు ఆత్మవిశ్వాసం ఏమాత్రం తగ్గలేదు. డేవిడ్ మిల్లర్ గత మ్యాచ్‌లో అద్భుతంగా ఆడినప్పటికీ తృటిలో విజయాన్ని దక్కించులేకపోయారు.

**పిచ్ రిపోర్ట్:**

సాధారణంగా చెన్నై పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుంది, కానీ ఇటీవలి కాలంలో ఇక్కడ భారీ స్కోర్లు నమోదు అవుతున్నాయి. బ్యాటర్లకు స్వర్గధామంగా మారిన ఈ పిచ్‌పై మరోసారి పరుగుల వరద పారే ఛాన్స్ ఉంది. ఈ ఫ్లాట్ ట్రాక్‌పై టాస్ గెలిచిన జట్టు భారీ స్కోరు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటుంది.

**ఎవరు గెలుస్తారంటే?**

ప్రస్తుత ఫామ్ ప్రకారం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింటిని గెలిచిన ఢిల్లీ, పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతుంది. ఈ మ్యాచ్ గెలిస్తే వారు మూడో స్థానానికి వెళ్తారు. కానీ డెవాల్డ్ బ్రెవిస్ రాకతో చెన్నై కూడా గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది.



# ఒకరితోనే డేటింగ్ అతడితోనే పెళ్లి!



ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి వ్యక్తిగత జీవితంపై పూర్తి క్లారిటీతో ఉందా? అంటే అవుననే అనాలి. నేటి తరం యువత డేటింగ్ సంస్కృతిపై భిన్నమైన అభిప్రాయాలతో ఉన్నప్పటికీ కృతి మాత్రం పాత తరం విలువలకే ప్రాధాన్యత ఇస్తానని చెప్పుకొచ్చింది. తాను ఎవరితోనైనా డేటింగ్ చేస్తే? అది కేవలం పెళ్లి కోసమే ఉంటుందని ఒకరితోనే ప్రేమ.. అతడితోనే జీవితం అనే సూత్రాన్ని తాను నమ్ముతానని వెల్లడించింది. ఈ వ్యాఖ్యలు ఆమెలోని పరిణతిని, సంప్ర దాయాల పట్ల ఉన్న గౌరవాన్ని చాటుతున్నాయి. ప్రేమ , పెళ్లి విషయంలో కృతి శెట్టికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఉన్నట్లు కనిపిస్తుందని ఆమె మాటలతో అర్ధమవుతుంది. ప్రస్తుతానికి కృతిశెట్టి దృష్టి సినిమాలపైనే ఉందని మరో ఐదేళ్ల వరకు ప్రేమ లేదా పెళ్లి అనే ఆలోచనే తన దరిదాపుల్లోకి రాదని స్పష్టం చేసింది. ఐదేళ్ల తర్వాత మాత్రమే తన వ్యక్తిగత జీవితం గురించి ఒక నిర్ణయం తీసుకుంటానని అప్పటి వరకు తన శక్తిని, సమయాన్ని నటనకే కేటాయిస్తానని పేర్కొంది. ప్రేమ అనేది ఒక బాధ్యత అని సరదా కోసం చేసే పని కాదని కృతి అభిప్రాయపడింది. తాను పెళ్లాడబోయే వ్యక్తి తనను అర్థం చేసుకునేవాడై, తన వృత్తిని గౌరవించే వాడై ఉండాలంది. డేటింగ్ పేరుతో సమయాన్ని వృధా చేయడం కంటే ఒకే వ్యక్తితో బలమైన బంధాన్ని ఏర్పరచుకోవడమే ఉత్తమమని అమ్మడు నమ్ముతోంది. గ్లామర్ ప్రపంచంలో ఉంటూ ఇంతటి స్థిరమైన ఆలోచనలు కలిగి ఉండటం విశేషం. కెరీర్ ప్రారంభంలోనే ఇలాంటి స్పష్టత ఉండటం వల్ల వృత్తిపరంగా ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకునే అవకాశం ఉంది. చాలామంది నటీమణులు కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు రూమర్ల బారిన పడుతుంటారు. అయితే కృతి శెట్టి ముందే ఇలాంటి ప్రకటన చేయడం ద్వారా అనవసరమైన గాసిప్స్‌కు చెక్ పెట్టినట్లయింది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం భాషల్లోనూ అవకాశాలు దక్కించుకుంటున్న మంగళూరు భామ నటనతో ప్రేక్షకులను మెప్పించడమే పరమావధిగా భావిస్తుంది.కృతి శెట్టి కెరీర్ పై ఉన్న స్పష్టతతో ఇటు నిర్మాతలకు, అటు అభిమానులకు ఒకరకమైన భరోసా ఇచ్చినట్లే. ఐదేళ్ల పాటు కేవలం వెండితెరపైనే కనిపిస్తానని చెప్పడం ఆమె అంకితభావాన్ని సూచిస్తోంది. దీంతో నిర్మాతలు నిశ్చింతగా సినిమాలు చేసుకోవచ్చు. కృతి శెట్టి ఫాలోవర్స్ అమ్మడి కోస ప్రయత్నాలు చేయోచ్చు. ఈ బ్యూటీ నటించిన ఎల్ ఐ కె సినిమా కొన్ని గంటల క్రితమే రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా విజయంపై అమ్మడు చాలా ఆశలే పెట్టుకుంది. అలాగే తెలుగులోనూ ఓ అగ్ర హీరో ప్రాజెక్ట్ కు సైన్ చేసింది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com